# డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రచన 'బుద్ధ - కార్ల్ మార్క్స్' చదివిన తర్వాత తక్షణ ప్రతిస్పందన

అలోక్ ముఖర్జీ

**ఆధునిక** భారతదేశపు ఒకానొక గొప్ప ఆలోచనపరుడు, ప్రముఖ సామాజిక ఆర్థిక సంస్కర్త అయిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ – వారి వారి సంబంధిత కాలాల్లో నిస్సందేహంగా మానవజాతికి అత్యంత గొప్ప సిద్ధాంత, తాత్విక మార్గదర్శకత్వాల నందించిన వారిని– బుద్ధుడిని, కార్ల్‌మార్క్స్‌ని – తులనాత్మకంగా అధ్యయనం చేశాడు. బుద్ధుడు, కార్ల్‌మార్క్స్‌లు జీవించి ఉన్న కాలాల మధ్య తేడా సుమారు 2400 సంవత్సరాలు ఉన్నప్పటికీ, ఈ అధ్యయనం గంభీర కార్యకర్తల దృష్టిని వెంటనే ఆకర్షించి, దీనిపై ప్రతిస్పందింప చేసింది. డాక్టర్ అంబేద్కర్ యొక్క ఈ రచన చదివిన తరువాత, ఒక మార్క్సిస్టు– లెనినిస్టు తక్షణ ప్రతిస్పందన ఇది.

అసామాన్య పండితుడైన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్–బుద్ధుడు, మార్క్స్‌ల మౌలిక బోధనల గురించిన తన అవగాహనను మొదటగా మన ముందుంచాడు. తదనంతరం వారి ఇరువురిని పోల్చుకుంటూ ముందుకెళ్లాడు. అయితే ఈ ఇద్దరు గొప్ప వ్యక్తుల మధ్య 2381 సంవత్సరాల కాల వ్యవధి ఉందని ప్రారంభంలోనే ఎత్తి చూపినప్పటికీ, అది కేవలం వ్యక్తులుగా వారిని విభజించిన సంవత్సరాల సంఖ్య మాత్రమే కాదని, చరిత్రలోని వివిధ అంచెలు, దశలు, అదేవిధంగా వివిధ రకాల మానవ సమాజాల గుండా మానవజాతి ప్రయాణించిన సుదీర్ఘ కాలం కూడాననే విషయాన్ని పరిగణలోకి తీసుకోవడంలో ఆయన విఫలమయ్యాడు. ఇది – బుద్ధుడిని, మార్క్స్‌ని అవగాహన చేసుకోవడం పైనా, తత్ఫలితంగా ఆయన అంతిమ నిర్ధారణల పైనా, ప్రముఖంగా ప్రభావం చూపుతోంది. ఈ వాస్తవాలను గుర్తించకుండా, ఇలా పోలిక చేయడం... సుద్ద ముక్కలను, వెన్న ముద్దలను కలగాపులగం చేసేందుకే దోవతీస్తుంది

### బుద్ధుని గురించి డాక్టర్ అంబేద్కర్ గందరగోళపు అవగాహన

**1.** భారతదేశ సామాజిక చరిత్రలో గౌతమ బుద్ధుని కాలం, ప్రత్యేకించి బుద్ధుడు జన్మించిన, జీవించిన, బోధి జ్ఞానం సిద్ధించిన, ధమ్మ బోధించిన, మరణించిన కాలం, గొప్ప ప్రాధాన్యత సంతరించుకున్నది. క్రీస్తుపూర్వం 600 నుండి క్రీస్తుపూర్వం 300 సంవత్సరాల మధ్య ప్రాంతంలో గంగానది మైదానాల చుట్టుపక్కల స్థిర వ్యవసాయం కోసం, గనుల తవ్వకాల కోసం మార్గాలను నిర్మించేందుకు, భారీ స్థాయిలో అడవులను నరికి వేశారు. ఆదివాసీ సమాజం, తమ ఎన్నికైన 'పెద్ద'తో సహా, అప్పుడే ఉద్భవిస్తున్న క్రూరమైన కేంద్రీకృత రాజ్యాలకు లోబడాల్సి వచ్చింది. బింబిసారుడు రాజుగావటానికి ప్రారంభం, బుద్ధుని తొలి సంవత్సరాలలో జరిగింది. కేంద్రీకృత రాజ్యం కారణంగా, సమాజం కూడా ఉత్పత్తి శక్తుల పెంపు కొరకు ఒక నిర్మాణాన్ని ఏర్పరచుకోవలసి వచ్చింది. ఆదివాసుల 'సమానత్వ' స్థానంలో, వర్ణ విభజన ముందుకొచ్చింది. బుద్ధుడు క్రీస్తుపూర్వం 563లో జన్మించి, 80 సం॥ల కాలం జీవించాడు. బింబిసారుడు క్రీస్తు పూర్వం 544లో మగధ సామ్రాజ్యాన్ని అభివృద్ధి చేసిన హర్యంక వంశాన్ని ప్రారంభించాడు. బుద్ధుడు సామ్రాజ్య నిర్మాణ క్రమాన్ని చూశాడు. ఆదివాసీ సమాజాల శిథిలాల నుండి నిర్మితమయ్యే క్రూరమైన రాజ్యాధికారాలను ఆయన చూశాడు. బుద్ధుడు కూడా శాక్య తెగకు చెందిన ఆదివాసీ గణ పెద్దల కుటుంబంలో జన్మించిన వాడే. ఆయన జీవితకాలంలోనే, కోసల రాజకుమారుడైన విధుదవ, శాక్య రాజ్యంలోని వారందరినీ నిర్దాక్షిణ్యంగా ఊచకోత కోసి, శాక్య రాజ్యాన్ని జయించాడు. బహుశా బుద్ధుడు ఈ క్రింది విధంగా బోధించడానికి కూడా ఇదే కారణమై ఉంటుంది :

"..... సుసంపన్న కోశాగారాలతో, సంపదలతో రాజ్యాలను పరిపాలించే రాజులు, తమ దురాశను ఒకరిపై ఒకరు మరల్చుకొని, తమ తీరని కోర్కెలను నెరవేర్చుకునేందుకు తలపడేవారు. ఈ విధంగా వీరి చర్యలు నిరంతరాయంగా సాగుతూ, అశాశ్వతమైన ప్రవాహంలో ఈదుతూ, దురాశ, అంతులేని కోర్కెలతో కొనసాగుతూ ఉంటే, అప్పుడు భూమిపై శాంతితో ఎవరు నడవగలుగుతారు?" (దేవిప్రసాద్ చటోపాధ్యాయ, ఇండియన్ ఫిలాసఫీ, పేజీ 128) దీనిని పరిగణలోకి తీసుకోకుండా, బుద్ధుని జీవితాన్ని, బోధనలను చర్చించే ఏ ప్రయత్నమైనా, పైపై పరిశీలనగా మాత్రమే ఉంటుంది. ఈ రచన సందర్భంగా అంబేద్కర్, ఆ పొరపాటు చేశాడు.

**2.** బుద్ధుని బోధనలను గుజ్జురూపంలో డాక్టర్ అంబేద్కర్ మూల్యాంకనం చేశాడు. తాను 'త్రిపీటిక'ను చదివి ఈ భావనకు వచ్చినట్లుగా చెప్పినప్పటికీ, ఈ అవగాహన మొత్తంగా తప్పుదోవ పట్టించేదిగా ఉంది. బుద్ధుని ప్రకారం– ధమ్మ అనేది, యూరప్ దేశాల మతాలకు, ఇతర మతాలకు బ్రాహ్మణీయ ధర్మాలకు కూడా భిన్నమైనది. బుద్ధుని భావనల ప్రకారం–దుఃఖాన్ని తొలగించుకునే లక్ష్యంతో జీవితాన్ని జీవించాలి. అలాగే ధమ్మ అంటే, ఈ మనుగడ నుండి విడుదల కావటానికి షరతులతో కూడిన మార్గం చూపేది. అయితే ఇదే లక్ష్యాన్ని సాధించేందుకు యూరోపియన్ మతాలు ప్రాథమికంగా ఒకానొక 'అతీత శక్తికి' లోబడాలని చెబుతాయి. కార్ల్ మార్క్స్ అత్యంత ఖచ్చితంగా దీనికి గల కారణాన్ని వివరించాడు. బుద్ధుని ప్రకారం, "పరిస్థితుల నుండి చైతన్యం ఉద్భవిస్తుంది...కానీ, పరిస్థితులతో సంబంధం

లేని చైతన్యం ఉండదు". (మగతాన్ సాంఖ్య సూత్ర) పదార్థానికి, చైతన్యానికి నడుమ ఉండే భౌతిక వాద సూత్రం ఇది. ఈ తాత్విక దృక్పథం, నాలుగు 'పవిత్ర సత్యాల' అవగాహన వైపు నడిపింది.

(ఏ) జీవితంలో బాధ (దుఃఖ) ఉంది. (బి) బాధలకు కారణం, కోర్కెలు (సి) కోర్కెలు ముగియటం అంటే బాధ ముగియటమే (డి) అదుపులో నుండే నిగ్రహ జీవనశైలిని అనుసరించడం, కోర్కెలను అంతరింపచేస్తుంది. కావున, ఆ విధంగా బాధలు అంతరిస్తాయి. బుద్ధుని బోధనల సారం ఇది. దీని అర్థం ఏమంటే, బుద్ధుని బోధనల ప్రకారం, పరిస్థితుల నుండి చైతన్యం ఉద్భవించడం వద్దే 'క్రమం' ఆగిపోకపోవటమే కాకుండా, చైతన్యం కూడా పరిస్థితుల కనుగుణంగా వ్యవహరించగలుగుతుంది. ఆ విధంగా చైతన్యానికి, పరిస్థితులకు నడుమనున్న గతితార్కిక సంబంధాన్ని వ్యక్తీకరించాడు. దీనినే బుద్ధుడు తన ఆదేశంలో ఇలా తెలిపాడు: "మతం కర్తవ్యం, ఈ ప్రపంచాన్ని పునర్ నిర్మించడం... దానిని ఆనందమయం చేయడం". అయితే పరిస్థితులతో సంబంధంలేని ఆదర్శవాద సూత్రీకరణ లాగా డాక్టర్ అంబేద్కర్ దానికి వక్ర భాష్యం చెప్పాడు. డాక్టర్ అంబేద్కర్ అవగాహనలోని బుద్ధుని తాత్విక భావజాలం గురించిన కొరవల గురించి కూడా మనం తర్వాత చర్చిద్దాం. బుద్ధుని గతితార్కిక వైఖరి వస్తుగతంగా ప్రారంభమైనప్పటికీ, దానిలోని ఆదర్శవాదం పాత్ర గురించి కూడా సాధ్యమైతే చర్చిద్దాం.

**3.** డాక్టర్ అంబేద్కర్ బుద్ధుని ఒక ప్రత్యేక బోధనను వక్కాణించి చెప్పాడు: "మనిషిని కొలవడానికి ప్రతిభ తప్ప, పుట్టుక ప్రమాణం కాదు" బుద్ధుని ప్రకారం-పుట్టుక ద్వారా ఎవరూ కుల భ్రష్టులు కాలేరు... పుట్టుక ద్వారానే ఎవరూ బ్రాహ్మణులు కాలేరు... వారి, వారి చర్యల ద్వారానే, ఎవరైనా కుల భ్రష్టులో, బ్రాహ్మణులో కాగలుగుతారు. (త్రిపిటిక మార్గదర్శినిలో పేర్కొన్న 'వేశాల సూత్త' నుండి, సంకలనకర్త యూ కో లే, బుద్ధధర్మ ఎడ్యుకేషన్ అసోసియేషన్, పేజీ 138 ) దీని నుండి డాక్టర్ అంబేద్కర్ ఒక ఆచారిత్రికమైన, తుడిచిపెట్టే వ్యాఖ్యానం చేశాడు. లోతుల్లోకి వెళ్ళకుండానే బుద్ధుని కాలం నాటి 'ఒక ప్రజాస్వామిక వాదిని' మార్క్స్ లేదా ఆ తర్వాత కాలం నాటి 'ఒక ప్రజాస్వామిక వాదిని' పోల్చి గందరగోళ పరిచాడు. అలా కాకుంటే, బుద్ధుడు సైతం మహిళల పట్ల వివక్షాపూరిత ప్రమాణాలు పాటించడాన్ని ఆయన గమనించి ఉండేవాడు. డాక్టర్ అంబేద్కర్ భిక్కుల గురించి చాలా ఎక్కువగా ప్రస్తావించాడు. కానీ, భిక్కునీల విషయంలో మౌనంగా ఉండిపోయాడు. మహిళలు భిక్కుల 'క్రమం'లోకి ప్రవేశించడానికి బుద్ధుడు ఏర్పరచిన షరతులను చూద్దాం. బుద్ధుడు జ్ఞానోదయం అనంతరం, తన జన్మస్థలమైన కపిలవస్తును సందర్శించిన సందర్భంలో, తనను సాకిన తల్లి మహా పజాపతి (మరొక సందర్భంలో అంబేద్కర్ ఈమెను బుద్ధుని కన్నతల్లిగా పొరపాటుగా ప్రస్తావించాడు) తనతో సహా 500 మంది శాక్య మహిళలను అతని 'క్రమం'లో ప్రవేశానికి అనుమతి నీయవలసిందిగా అభ్యర్థిస్తుంది. బుద్ధుడు వారి ప్రవేశానికి అంగీకరించడు. బుద్ధుని తండ్రి శుద్ధోధనుని మరణానంతరం, తిరిగి ఆమె 500 మంది మహిళలతో సహా బుద్ధుని 'క్రమం'లో చేరేందుకు వైశాలి వరకు వెళుతుంది. బుద్ధుడు అప్పటికీ వారి ప్రవేశాన్ని వ్యతిరేకిస్తుంటాడు. ఆఖరుకు, ఆయన ప్రధాన శిష్యులలో ఒకరైన ఆనందుడు కలుగజేసుకుని, బుద్ధుని తల్లి యోగ మాయ మరణించిన తర్వాత, ప్రజాపతి బుద్ధునికి పాలిచ్చి సాకిన విషయాన్ని గుర్తు చేసి, 'క్రమం' లోకి వారి ప్రవేశానికి బుద్ధుడిని అంగీకరింప చేస్తాడు. తాను భిక్కునీల కోసం రూపొందించిన ఎనిమిది నిబంధనలను మహాప్రజాపతి ఆమోదించిన తర్వాతనే బుద్ధుడు తన అంగీకారం తెలిపాడు. ఈనాటి ప్రమాణాల ప్రకారం విచారిస్తే, వాటి అప్రజాస్వామిక, పితృస్వామ్య స్వభావం వెల్లడవుతుంది. వాటి సారాన్ని అర్థం చేసుకునేందుకు,వాటిలో కేవలం రెండింటిని మాత్రమే క్లుప్తంగా ఇక్కడ అందిస్తున్నాం.

1. ఒక భిక్కునీకి 'క్రమం'లో వందల సంవత్సరాల కాలపు పెద్దరికం ఉన్నప్పటికీ కూడా, ఆమె ఒక భిక్కు ఎడల- అతను ఒక్కరోజు పెద్దరికం గల భిక్కు మాత్రమే అయినప్పటికీ -అతని పట్ల గౌరవం ప్రదర్శించాలి.

2. భిక్కులు తనకు ఇచ్చిన సూచనలకు భిక్కునీ తప్పనిసరిగా కట్టుబడి ఉండాలి; కానీ, భిక్కులకు ఎట్టి పరిస్థితుల్లోనూ సూచనలు లేదా సలహాలను ఇవ్వరాదు.

కనుక, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బుద్ధుని కాలం నాడు నెలకొన్న సామాజిక స్థితిగతులతో సంబంధం లేకుండా అతనిని ' పుట్టుకతోనే ప్రజాస్వామ్యవాది' అనీ, 'ఒక ప్రజాస్వామిక వాదిగానే మరణించాడు' అని చిత్రించడం ద్వారా, బుద్ధుడు బోధించిన ధర్మం యొక్క వాస్తవిక పరిస్థితులను ఆయన విస్మరించాడు. రాజకీయ, ఆర్థిక, సామాజిక క్రమంలో వచ్చిన మార్పులకు వ్యతిరేకంగా నిరసన, పన్నుల భారం, బానిసత్వం, దోపిడీ, చిత్రహింసలు, తాకట్టు, వడ్డీ వ్యాపారం, శారీరక శ్రమ పట్ల విముఖత్వం ఏర్పడటం, అన్నింటినీ మించి, భారతదేశ ప్రత్యేకతగా ముందుకొచ్చిన వర్ణ విభజనలు, ఉత్పత్తి శక్తుల అభివృద్ధితో నూతన ప్రాంతాలు జయింపబడి భిన్న జాతుల వారిని విజేతల సమాజంలోకి ఈడ్చి, సమాజపు క్రింది తరగతి వారిగా ఉంచటం... వంటి అనేక పరిణామాలు ఉన్నాయి. ఈ నూతన సంస్థలు, సమానత్వ స్థితిలో జీవించిన ఆదివాసీ ప్రజానీకపు జీవితాలలో చెప్పనలవికాని బాధలకు కారణమయ్యాయి. బుద్ధుడు ఈ బాధలకు నివారణోపాయాల కోసం ప్రశ్నించి, ఈ బాధలకు కారణాలను తొలగించేందుకు ప్రయత్నించాడు. ప్రజలపై బలవంతంగానైనా కాకున్నా, విధించిన సామాజిక క్రమాన్ని మార్చేందుకు తిరుగుబాటు కాకుండా నిరసన మార్గాన్ని ఎంచుకున్నాడు. ఆ పరిస్థితులలో సమూల మార్పు కోసం ఒక పంథాను ముందుకు తీసుకు

రాగలగటం అనేది, చారిత్రకంగా కూడా అసాధ్యం. బాధలను (దుఃఖం, దుఃఖ) రూపుమాపటం, మరియు మనుగడ నుండి విడుదలకు షరతులతో కూడిన మార్గంచూపడం అతని లక్ష్యం.

ప్రారంభంలో ఎనిమిది అంచెల అష్టాంగ ఉత్తమ పథం (1. సరైన ఆలోచన 2. సరైన ధ్యేయం3. సరైన సంభాషణ 4. సరైన ప్రవర్తన 5. సరైన జీవనం 6. సరైన జాగ్రత్త 7. సరైన చింతన 8. సరైన సమాధి (ధ్యానం) ద్వారా) మరియు పంచశీల (సంహరించడానికి, దొంగతనానికి, లైంగిక దుష్ప్రవర్తనకు, అబద్ధాలు చెప్పటానికి, మద్యపానీయాలు, మత్తుమందులు మొదలైన మెదడును మొద్దుబార్చే మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండటం) ఆచరించడం ద్వారా ధ్యానంతో ఉత్తమ పథాన్ని సాధించవచ్చునని అతను ఆశించాడు.

కనుక ప్రారంభంలో, 'బుద్ధం శరణం గచ్ఛామి', 'ధర్మం శరణం గచ్ఛామి' అని వల్లెవేయడం, బుద్ధుని పట్ల, అతని బోధనల పట్ల విశ్వాసాన్ని ప్రకటించే సంకేతంగా ఉండేది. దుఃఖాన్నుండి బయటపడేందుకు అనివార్యంగా వ్యక్తులు, వ్యక్తిగతంగా అనుసరించవలసిన మార్గం ఇది. తదనంతర కాలంలో 'సంఘ' స్థిరపడిన తర్వాత, ఈ సంకేతం మూడో నిబద్ధతను కలుపుకొని 'సంఘం శరణం గచ్ఛామి'గా విస్తరించింది. (యూ కో లే, గైడ్ టు త్రిపిటక, పేజీ 35) ఈ విస్తరణ ఎందుకు చోటు చేసుకుంది? ఎందుచేతనంటే, నిరసన ఒక సామూహిక చర్యగా ఉండి తీరాలని బుద్ధుడు కనుగొన్నాడు కనుక. బాధలకు (పబ్బజ) కారణమైన సమాజం నుండి సామూహికంగా బయటకు వెళ్లడం, మరియు సంఘాల (ఉప సంపద) పట్ల సత్య ప్రమాణం చేయడం... ఆదివాసీ సమూహాలను ఉద్దేశపూర్వకంగా ఆదర్శీకరించడమే. నాలుగు విశిష్ట సత్యాల, పంచశీలల, అష్టాంగ మార్గాల ద్వారా... అన్నీ కలిసి, దృఢమైన వ్యక్తి వాద అంశాలే ఆచరించబడతాయి. నిరసన లాగా దీనిని మరింత దృఢపరచాలంటే సంఘాలు స్థిరపడాలి. అయితే మొత్తం మీద సమాజంలో ప్రజాస్వామ్య చట్రాన్ని స్థిరపరిచేందుకు అవి సామూహిక కేంద్రాలు కావు. కాకపోగా, అవి ధమ్మపై ఆధారపడి పాలన సాగించాలని, విస్తృత సమాజానికి, రాజులకు విజ్ఞాపనలు చేయడానికి పరిమితం అవ్వటం, ఒక ఊహాజనిత ప్రతిపాదన మాత్రమే. డాక్టర్ అంబేద్కర్ చెప్పిన విధంగా ఆలోచించేందుకు ఉన్నత స్థాయిలో ఊహించాల్సిన అవసరం ఉంది. బుద్ధుడు ప్రతిపాదించిన కమ్యూనిజం సాధించడానికి, సాధనాలు పూర్తిగా స్థిరమైనవి. అయితే బుద్ధుడిని మార్క్సను పోల్చే అంశంలోకి విస్తరించినప్పుడు, అనుకూల ఆలోచన లేదా ఊహాజనితం కంటే మరింతగా కసరత్తు చేయాల్సి ఉందని, అందులో దాగి ఉన్నట్లుగా కనిపిస్తోంది.

## మార్క్స్ గురించి డాక్టర్ అంబేద్కర్ అవగాహన

ఇప్పుడు డాక్టర్ అంబేద్కర్, మార్క్సను ఏ విధంగా పరిశీలించాడో చూద్దాం. ఒక గొప్ప పండితునిగా, ప్రసిద్ధ సామాజిక శాస్త్రవేత్తగా డాక్టర్ అంబేద్కర్ చాలా సరిగ్గా ఇలా పేర్కొన్నాడు: "మార్క్స్ బోధించిన శాస్త్రీయ సోషలిజం అనగా అతని 'ముద్ర' అయిన సామ్యవాదం అనివార్యం, తప్పించు కోలేనిది. అలాగే సమాజం ఆ దిశగా పయనిస్తోంది. దాని గమనాన్ని ఏదీ అడ్డగించలేదు". అయితే దీని తర్వాత మార్క్స్ మౌలిక బోధనలను అతి సరళీకృతం చేసే ప్రయత్నాల్లో మార్క్స్ గురించి, మార్క్సిజమ్ గురించిన తన పరిజ్ఞానం పైపై పరిశీలనేనని తనే రుజువు చేసుకున్నాడు. దానిని ఒక్కసారి చూద్దాం.

**1.** మార్క్స్ సిద్ధాంతంగా పేర్కొంటూ ఆయన మొట్టమొదట పేర్కొన్న అంశం ఇలా ఉంది: "తత్వశాస్త్ర ప్రయోజనం, ప్రపంచాన్ని పునర్ నిర్మించడం తప్ప, దాని మూలాన్ని వివరించడం కాదు". కానీ, తన ప్రాచుర్యం పొందిన వాక్యంలో మార్క్స్ ఇలా పేర్కొన్నాడు: "తత్వవేత్తలు ప్రపంచాన్ని పలు విధాల నిర్వచించారు, కానీ విషయమేమంటే... దానిని మార్చటం". 'ప్రపంచాన్ని పలు విధాలా' అనే దానిని, 'విశ్వం పుట్టుకను వివరించడం'గా వ్యాఖ్యానించరాదు. వీటిని గందరగోళపరచడం మొత్తంగా మార్క్సను, మార్క్సిజాన్ని తప్పుగా అవగాహన చేసుకోవడం మినహా వేరు కాదు.

**2.** తర్వాత డాక్టర్ అంబేద్కర్, మార్క్స్ సిద్ధాంతం గురించి చెబుతూ... చరిత్ర గతిని నిర్ణయించేది ప్రధానంగా ఆర్థిక శక్తులే అని పేర్కొన్నాడు. ఇది కూడా మార్క్స్ భావాలను అతి సరళీకృతం చేసిన అవగాహన. మార్క్స్ చాలా స్పష్టంగా ఇలా వ్యక్తీకరించాడు: "చరిత్ర అంటే మానవులు, తమ లక్ష్యాల సాధన కోసం సాగించే కార్యకలాపాలు మినహా మరొకటి కాదు". (హోలీ ఫ్యామిలీ, సెలెక్టెడ్ రైటింగ్స్ ఇన్ సోషియాలజీ అండ్ సోషల్ ఫిలాసఫీ, కార్ల్ మార్క్స్, ఎడిటెడ్ బై టీ బీ బట్టోమోర్ అండ్ మాక్సి మిల్లెన్, రూబెల్ పెంగ్విన్ బుక్స్, పేజీ 78) నిజం, మానవులు తమ తీయనైన ఆకాంక్షల కనుగుణంగా కార్యకలాపాలను కొనసాగించలేరు. ఆ భాగాన్ని కూడా మార్క్స్ వివరించారు: "ఉత్పత్తిశక్తుల అభివృద్ధి క్రమంలో, ఉత్పత్తి శక్తుల సాధనాలు, ఒక స్థితికి చేరుకోవడం జరుగుతుంది. ఉనికిలో ఉన్న సంబంధాలు హానికరంగా పరిణమిస్తాయి. కనుక అవి ఇంకే మాత్రమూ ఉత్పత్తి కరమైనవిగా కాక విధ్వంసక శక్తులుగా (యంత్రాలు, డబ్బు) మిగిలిపోతాయి. (పై పుస్తకం, పేజీ 79) ఆ విధమైన పాదార్థిక పరిస్థితి... స్థితిగతులను మార్చుకునేందుకు చరిత్ర రూపొందించిన వర్గ ఆవిర్భావంతో కలగలిసి ఉంది. ఆ కారణంగానే కమ్యూనిస్టు ప్రణాళికలో కార్ల్ మార్క్స్ ఇలా ప్రకటిస్తాడు: "ఇప్పటివరకు గడిచిన సమాజ చరిత్ర అంతా వర్గ పోరాటాల చరిత్రే" మార్క్స్ ప్రకారం బుద్ధుని కాలం నుండి ఈనాటి వరకు దోపిడీదారులు, పీడితులు గుణశీలాలలో ఒకేలా ఉన్నారు. కనుక వర్గాలను యజమానులు శ్రామికులుగా విభజించటం సరిపోతుంది.

**3.** తత్పర్యవసానంగా అంబేద్కర్, చరిత్రలో వారు ఏ దశలకు చెందుతారు అనే దానితో సంబంధం లేకుండా 'సమాజం

రెండు వర్గాలుగా... యజమానులు, కార్మికులుగా విభజింపబడింది' అని పేర్కొన్నాడు. యజమానులనే వారి స్వభావం వివిధ చారిత్రక కాలాలలో ఒకే తీరులో ఉండదనే అంశాన్ని, ఉదాహరణకు బానిస యజమానుల నుండి ఫ్యూడల్ ప్రభువులుగా, పెట్టుబడిదారులుగా మార్పు చెందడాన్ని ఆయన విస్మరించాడు. అదేవిధంగా పీడిత ప్రజలు కూడా, ఉదాహరణకు బానిసలు, అర్ధ బానిసలు, పారిశ్రామిక కార్మికులు... ఇలా భిన్న పాత్రలలో ఉంటారు. పీడిత ప్రజల 'మిగులు శ్రమ' దోపిడీ కూడా భిన్నమైన ఉత్పత్తి విధానాలలో, భిన్న రకాలుగా ఉంటుంది.

**4.** ఈ పైపై అవగాహన కొనసాగింది. మనం వాటన్నింటినీ సవిస్తారంగా చర్చించటం లేదు. అయితే మార్క్స్ విషయంలో ఆయన దృక్పథంలో మొత్తంగా తప్పుగా వ్యక్తమైన వాటిని ఎత్తిచూపుతున్నాం. డాక్టర్ అంబేద్కర్ ఇలా పేర్కొన్నాడు : "మార్క్స్ సిద్ధాంతం ప్రకారం యజమానుల కన్నా కార్మికులు అధిక సంఖ్యాకులు కాబట్టి, శ్రామికులు రాజ్యాన్ని స్వాధీనం చేసుకొని, మార్క్స్ కార్మికవర్గ నియంతృత్వంగా పేర్కొనే దానిని అమలుచేసి, వారి అధికారాన్ని స్థాపిస్తారు". అయితే మార్క్స్ వాస్తవిక అభిప్రాయాన్ని 'జర్మన్ ఐడియాలజీ' అనే మార్క్స్ ప్రముఖ రచన నుండి కొంచెం పెద్దదిగా ఉన్నప్పటికీ, ఈ ఉల్లేఖన ద్వారా స్పష్టంగా అర్థం చేసుకోవచ్చు:

"**1.** ఉత్పత్తి శక్తుల అభివృద్ధి క్రమంలో... ఉత్పత్తి శక్తులు, ఉత్పత్తి సాధనాలు ఒక స్థితికి చేరుకోవడం జరుగుతుంది. ఉనికిలో ఉన్న సంబంధాలు హానికరంగా పరిణమిస్తాయి. కనుక అవి ఇంకేమాత్రము ఉత్పత్తికరమైనవి కాక, విధ్వంసక శక్తులుగా (యంత్రాలు, డబ్బు) మిగులుతాయి. దీనితో అనుసంధానమై, సమాజంలోని ప్రయోజనాలనేమీ అనుభవించకుండానే, సమాజం నుండి బహిష్కృతమై, ఇతర అన్ని వర్గాలకు అత్యంత వ్యతిరేకంగా నెట్టబడి, సమాజంలోని భారాలన్నింటినీ భరించే ఒక వర్గం ఉద్భవిస్తుంది. ఈ వర్గం సమాజంలోని అత్యధిక సభ్యులతో కూడుకొని, ఒక ప్రాథమిక విప్లవ అవసరం కొరకు చైతన్యాన్ని, కమ్యూనిస్టు చైతన్యాన్ని అభివృద్ధి చేసుకునేదిగా ఉంటుంది. పరిశీలన నుండి ఈ వర్గ పరిస్థితి ఇతర వర్గాలలో కూడా, ఈ చైతన్యం తలెత్తవచ్చు.

**2.** నిర్ణయాత్మక ఉత్పత్తి శక్తులను ఏ పరిస్థితులలో ఉపయోగించవచ్చో, అవి కూడా ఒక నిర్ణయాత్మక సామాజిక వర్గ ఆధిపత్యం కొరకు పరిస్థితులుగా ఉంటాయి. ఆస్తులపై యాజమాన్యం ద్వారా సంక్రమించిన వీరి సామాజిక అధికారం స్థిరంగా, దాని ఆచరణ యొక్క భావజాల వ్యక్తీకరణను రాజ్యాల ప్రత్యేక రూపంలో కనుగొంటాయి. పర్యవసానంగా ప్రతి విప్లవాత్మక పోరాటం, అప్పటిదాకా ఆధిపత్యం వహించిన వర్గానికి వ్యతిరేకంగా ఎక్కుపెట్టబడుతుంది.

**3.** గత విప్లవాలన్నింటిలోనూ కార్యకలాపాల రూపం ఎల్లప్పుడూ మార్పు లేకుండా ఉండిపోయింది. ఒక నూతన శ్రమ విభజనను ప్రవేశపెడుతున్న భిన్న ప్రజానీకం నడుమ, ఈ కార్యకలాపాల పునఃపంపిణీ సమస్యగా మాత్రమే ఉంది. ఏమైనా, కమ్యూనిస్టు విప్లవం, గతకాలపు కార్యకలాపాల పద్ధతికి వ్యతిరేకంగా ఎక్కుపెట్టబడి, శ్రమను దూరం చేసి, తమతో సహా అన్ని వర్గాల పాలనలను రద్దు చేస్తుంది. కారణమేమంటే, శ్రామిక వర్గం ఏ వర్గం చేతిలో దెబ్బతిందో, ఆ వర్గం ఇక ఏమాత్రం సమాజంలో ఒక వర్గంగా గణింపజాలదు. ఒక వర్గంగా గుర్తింపబడజాలదు. సమకాలీన సమాజంలోని అన్ని వర్గాలు, జాతులు మొదలగునవి రద్దు అవటం యొక్క వ్యక్తీకరణ అది.

**4.** కమ్యూనిస్టు చైతన్యాన్ని భారీ స్థాయిలో సృష్టించటానికి, అదేవిధంగా ఆ విప్లవం విజయవంతంగా పరిష్కారం కావడానికి, మానవులందరూ తమంత తాముగా భారీ స్థాయిలో మార్పు చెందాల్సి ఉంటుంది. ఈ మార్పు ఆచరణాత్మక ఉద్యమం, అనగా విప్లవంలో మాత్రమే సాధ్యమవుతుంది. పాలకవర్గాన్ని మరే రూపంలోనూ కూలద్రోయడం సాధ్యం కాదు కనుకనే విప్లవం అవసరమౌతుంది అని మాత్రమే కాక, ఈ విప్లవం ద్వారా పాలక వర్గాన్ని కూలద్రోసే వర్గం, తనలో పేరుకుపోయిన చెత్త నుండి కూడా తాను విముక్తం చెంది, సమాజాన్ని పునర్నిర్మించడానికి సమర్థతను సంతరించుకుంటుంది.

బుద్ధుడిని మార్క్స్‌ను పోల్చే అంబేద్కర్ ప్రయత్నం, వారి మధ్య పోలికను ఎంచుకోవడం అనేది, తప్పుదోవ పట్టించేదిగా స్పష్టంగా అర్థం కావటానికి ఈ మాత్రం సరిపోతుంది. బుద్ధుడు, మార్క్స్ - ఇరువురి పట్ల అతని అవగాహన కూడా, వారు జీవించి ఉన్న నిర్దిష్ట కాలాన్ని పరిగణలోకి తీసుకోకుండా, వారి మధ్య పోలికను ఎంచుకోవడం తప్పుదోవ పట్టించడం, పూర్వాలోచనతో అస్పష్టం చేయడమే.

## డాక్టర్ అంబేద్కర్ ఎక్కడ పొరబడ్డాడు?

బుద్ధుని సిద్ధాంతం ప్రకారం 'దురాశ 'లేదా సంపద పట్ల కోర్కెలు అనేవి దుఃఖానికి మూల కారణాలుగా ఉన్నాయని అంబేద్కర్ సరిగానే ఎత్తి చూపాడు. అయితే, సంపూర్ణంగా తప్పు అయిన వాటిని కొన్నింటిని బుద్ధుని బోధనల లాగా ఆయన ముందు ఉంచాడు. బుద్ధుడు ఏనాడూ వీటిని అలా చెప్పి ఉండలేదు. ఉదాహరణకు- వర్గ విభేదాల పట్ల, బుద్ధుల స్వీయ దృక్పథం ప్రకారం...వర్గ విభేదాలు ఉనికిలో ఉంటాయని వారి అష్టాంగ మార్గ సిద్ధాంతం గుర్తించిందని, ఆ వర్గ విభేదమే దుఃఖానికి కారణం అని డాక్టర్ అంబేద్కర్ వివరించాడు.

అయితే బుద్ధుని కాలంలో వర్గ విభేదాలు అలా ఉంచి, వర్గం అనే అవగాహనే లేదు. అష్టాంగ మార్గాలు ఏమిటి? వాటిని ఇలా పేర్కొనవచ్చు: 1. సరైన ఆలోచన 2. సరైన ధ్యేయాలు 3. సరైన భాషణం 4. సరైన ప్రవర్తన 5. సరైన జీవనం 6. సరైన జాగ్రత్త 7. సరైన చింతన 8. సరైన సమాధి లేదా ధ్యానం. విడివిడిగా వ్యక్తులు వీటిని ఆచరిస్తారు. దీని ద్వారా 'అష్టాంగ మార్గ', వర్గ విభేదాలను గుర్తించిందని, లేదా వర్గ విభేదమే

దుఃఖానికి కారణమని పేర్కొనటం తప్పు అవుతుంది. బుద్ధుని ప్రకారం, ఇంతకుముందు పేర్కొన్న విధంగానే, దుఃఖానికి – దురాశ, పేరాశలు, కోర్కెలనేవి కారణాలుగా ఉన్నాయి. తదనంతర కాలంలో సంఘాలు స్థిరపడి, అధిభౌతిక జ్ఞానం నుండి బుద్ధుని మార్గాన్ని విడగొట్టి, ఆదివాసి సమూహాల ఆదర్శాలపై నిర్మించిన సంఘాలు, భారీ స్థాయిలో వర్ణ విభజిత సమాజానికి సమాంతరంగా రూపొందాయి. కనుక వర్ణ ఆధారితంగా అభివృద్ధి చెందుతున్న సామాజిక వ్యవస్థపై ఇదొక నిరసన మాత్రమే. వర్గ విభేదం అనే బుద్ధ చైతన్యాన్ని సంఘాల నిర్మాణం అంగీకరించి నప్పటికీ కూడా, బుద్ధుడు ఈ వర్గ విభేదాలలో ఏ పక్షం వహించాడు, లేదా ఏ పక్షం వహించే ప్రయత్నం చేశాడో చెప్పేందుకు డాక్టర్ అంబేద్కర్ ఎలాంటి రుజువునూ ఇవ్వలేకపోయాడు. పైగా బుద్ధుడు దోపిడీదారులను, రాజులను కనికరంతో ఉండవలసిందిగా విజ్ఞప్తి చేశాడు. 'ధమ్మ చక్ర' అర్థం ఇదే. అహింస ప్రాతిపదికగా నున్న దీనినే బుద్ధుడు ప్రబోధించాడు. ఆ కాలంలో పాత 'క్రమం', ఒక నూతన 'క్రమాని'కి లోబడుతుండగా, వర్ణ విభజన ఆధారితమైన నూతన రాజ్యాల వైపుగా ఆదివాసుల సమానత్వం నెట్టబడుతూ వచ్చింది తప్ప, అంతకుమించి మరేమీ జరగలేదు. ఉత్పత్తి శక్తుల అభివృద్ధి మరింకేమీ చేయటానికి బుద్ధునికి అవకాశం ఇవ్వలేదు. "బుద్ధుడు బోధించిన కమ్యూనిజం తీసుకు రావడానికి చేపట్టే సాధనాలు చాలా నిర్దిష్టంగా ఉన్నాయి" అనడమే అంబేద్కర్ ఎక్కడ పొరబడ్డాడో స్పష్టపరుస్తోంది. కారణమేమంటే, బుద్ధుని బోధనల ద్వారా జీవన స్థితిగతుల నుండి చైతన్యం ఉద్భవిస్తుందని మనం తెలుసుకున్నాం. వర్ణ వ్యవస్థపై ఆధారపడి సామాజిక విభజనలతో నున్న సామ్రాజ్య ఏర్పాటును వ్యతిరేకించే ఆదివాసుల సమానత్వం, సమానత్వ భావనలు మాత్రమే ఆనాడు సాధ్యం కాగలుగుతాయి. కమ్యూనిజాన్ని ఆనాడే సాధ్యం చేయడమనేది అసాధ్యమైన విషయం. డాక్టర్ అంబేద్కర్ ఎక్కడ పొరపాటు చేశాడో ఇది వివరిస్తుంది. కార్ల్ మార్క్స్ 'జర్మన్ ఐడియాలజీ' నుండి ఇచ్చిన ఉల్లేఖనలోని రెండవ పేరా, దీనికి పూర్తిగా వివరిస్తుంది. వాస్తవానికి వారి వారి కాలాల్లో పీడితులకు చెందిన, ఇద్దరు గొప్ప బోధకులైన బుద్ధుడిని, మార్క్స్‌ని ఒకరిపై ఒకరిని నిలపటం ద్వారా డాక్టర్ అంబేద్కర్ వారికి గొప్ప హాని చేశాడు.

**బుద్ధుడిని–మార్క్స్‌ను, ఒకరిపై ఒకరిని నిలిపే కసరత్తుకు డాక్టర్ అంబేద్కర్ ఎందుకు పూనుకున్నాడు?**

గొప్ప పండితుడు, ఆలోచనపరుడు అయిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చేసిన అత్యంత బలహీనమైన తప్పులలో బహుశా ఇది ఒకటి కావచ్చు. ఆయన ఈ వ్యాసాన్ని తన అవగాహనలతో, తన ప్రాపంచిక దృక్పథంతో రాశాడు. డాక్టర్ అంబేద్కర్ ప్రాపంచిక దృక్పథం కార్ల్ మార్క్స్ ప్రాపంచిక దృక్పథంతో సంపూర్ణంగా భిన్నమైంది. బుద్ధుడిని మార్క్స్‌ను పోల్చే కసరత్తు చేపట్టడానికి ఏది కారణమై ఉంటుంది? దీనిని అర్థం చేసుకోవాలంటే, అంబేద్కర్ ఎప్పుడు ఈ వ్యాసం రాశాడో తప్పక తెలుసుకోవాలి. డాక్టర్ అంబేద్కర్ 1956 అక్టోబర్ 14న బుద్ధిజంలోకి మారాడు. అదే సంవత్సరం డిసెంబర్ 6న మరణించాడు. 'బుద్ధ–కార్ల్ మార్క్స్' వ్రాతప్రతిని ఆయన 1956 డిసెంబర్ 2న అంటే ఆయన మరణానికి కేవలం నాలుగు రోజుల ముందు మాత్రమే పూర్తి చేశాడు. బుద్ధిజాన్ని ఆయన ఎందుకు స్వీకరించవలసి వచ్చిందనే అంశాన్ని ఆయన తన అనుయాయులకు వివరించే తొందరలో ఉన్నాడని ఈ వాస్తవం తెలియ చెప్తోంది. 1956 మార్చి ప్రాంతంలో ఒక సన్నాహక కసరత్తుగా 'ది బుద్ధ అండ్ హిజ్ ధమ్మ' వ్రాత ప్రతిని ఆయన పూర్తి చేశాడు. ఇది ఆయన మరణానంతరం ప్రచురితమైంది. తానెంచుకున్న వైఖరిని వివరించుకునేందుకు ఆయనకు ఒక చిన్న వ్యాసం అవసరమైంది. మార్క్సిజాన్ని కాకుండా, తాను బుద్ధిజాన్ని ఎందుకు స్వీకరించాడో వివరించవలసి వచ్చింది.

వాస్తవానికి తన జీవిత కాలమంతా దేనికోసమైతే పోరాడాడో, దానిని సాధించడంలో విఫలమైన ఆయన, గొప్ప వ్యక్తిత్వం కలిగి ఉండీ, తన జీవితంలోని చివరి సంవత్సరాలలో ఆనందంగా లేడు.

1916 కాలంలో డాక్టర్ అంబేద్కర్, కులాలను మనువు సృష్టించలేదని స్పష్టంగా పేర్కొన్నాడు. ఆయన ఈ విధంగా ప్రకటించాడు: "ఒక విషయం మీకు స్పష్టంగా చెప్పాలను కుంటున్నాను. మనువు కులాలకు సంబంధించిన చట్టాన్ని తీసుకురాలేదు. ఆయన అలా చేయలేదు కూడా. మనువు కంటే చాలా ముందు నుండి కులం ఉంది. దీనిని ఆయన పైకెత్తి పట్టాడు. ఈ క్రమంలో దానిని తాత్వీకరించాడు. కానీ ఖచ్చితంగా హిందూ సమాజ ప్రస్తుత క్రమాన్ని ఆయన రూపొందించలేదు; రూపొందించ లేదు కూడా. ఉనికిలో ఉన్న కుల నిబంధనలను క్రోడీకరించటంతో, కుల ధర్మాలను బోధించడంతో అతని కృషి ముగిసింది" (క్యాస్ట్స్ ఇన్ ఇండియా, దైర్ మెకానిజం, జెనిసిస్ అండ్ డెవలప్మెంట్, పేపర్ రెడ్ ఎట్ కొలంబియా యూనివర్సిటీ, న్యూయార్క్, 9 మే 1916, ఫ్రమ్ ఇండియన్ యాంటీక్వరీ, మే 1917, వాల్యూమ్ XLI, పేజీ 16)

ఈ ప్రశ్నపై మనం మార్క్స్‌ను కూడా సమాలోచన చేయవచ్చు:" పితృస్వామ్య వ్యవస్థలో, కుల వ్యవస్థలో, ఫ్యూడల్ గిల్డ్ వ్యవస్థలో, నిర్దిష్ట సూత్రాల కనుగుణంగా, మొత్తం మీద సమాజంలో శ్రమకు ప్రవేశం ఉంది. ఈ సూత్రాలు ఏదేని శాసనకర్త స్థిర పరిచినవా? కాదు. పాదార్థిక ఉత్పత్తి పరిస్థితుల నుండి, సహజంగా అవి పుట్టి, తదనంతర కాలంలో మాత్రమే అవి చట్టాలుగా స్థిరీకరించబడ్డాయి. ఈ విధంగా వివిధ రూపాలలోని శ్రమ విభజన, అనేక సామాజిక నిర్మాణాలకు ఆధారమైంది. (కోటెడ్ ఫ్రమ్ పావర్టీ ఆఫ్ ఫిలాసఫీ, కార్ల్ మార్క్స్ సెలెక్టెడ్ రైటింగ్ ఇన్ సోషియాలజీ అండ్ సోషల్ ఫిలాసఫీ, ఎడిటెడ్ బై టి.బి బొట్టో మోర్ అండ్ మ్యాక్స్ మిలన్ రూబెల్, పేజీ 105)

తన ఎన్నో ఇతర తాత్విక భావనల కంటే, డాక్టర్ అంబేద్కర్, మార్క్స్ భావనలకు సన్నిహితంగా ఉన్నాడని ఇది తెలుపుతోంది. అదే పత్రంలో అంబేద్కర్ ఇలా నొక్కి చెప్పాడు:”.... ముందుగా... హిందూ సమాజం, ఇతర సమాజాలలోవలే సాధారణంగా వర్గాలతో నిర్మితమైంది. అత్యంత ముందుగా తెలిసినవి ఏమంటే– 1. బ్రాహ్మణులు లేదా పూజారి వర్గం 2. క్షత్రియులు లేదా సైనిక వర్గం 3. వైశ్యులు–వ్యాపారవర్గం 4. శూద్రులు లేదా చేతివృత్తులు– నీచ వర్గం. (క్యాస్ట్స్ ఇన్ ఇండియా, పేజీ 17,18) ఆయన తర్వాత కుల వ్యవస్థ ఏ విధంగా పరిణామం చెందిందో చర్చించి ఇలా చెప్పాడు: “ఒక సమాజంలో ఈ ఉప విభాగం అనేది చాలా సహజమైంది. కానీ, ఈ ఉపవిభాగాల గురించిన అసహజమైన విషయం ఏమంటే, అవి వర్గ వ్యవస్థకు చెందిన ‘తలుపు తెరిచి ఉంచే’ స్వభావాన్ని కోల్పోయి, కులాలుగా పిలిచే, తమకు తాముగా ‘దడి కట్టుకొని ఉండే’ విభాగాలుగా రూపొందాయి. (పై పుస్తకం, పేజీ 18) అయితే ఒక విధమైన వర్గ విభజనే అయిన వర్ణవిభజన, కుల విభజనగా ఎలా రూపొందిందో ఆయన పసికట్టలేకపోయాడు. ఆయన వివరణ ఏమంటే... తొలుత బ్రాహ్మణులు, తమకు తాముగా ఒక కులంగా వేరుపడ్డారని, తర్వాత ఇతరులు ఆ మార్గాన్ని అనుసరించారని, ప్రాథమిక కణ పదార్థాలుగా (Inchoate Plasm) వైశ్యులు, శూద్రులు, వృత్తుల కనుగుణంగా విభజన చెందారని పేర్కొన్నాడు. ఉత్పత్తిశక్తులకు, ఉత్పత్తి సంబంధానికి మధ్య వైరుధ్యానికి ఆయన వివరణలో స్థానం లేదు. కనుక, ఆయన అవగాహనలో కులాన్ని దడికట్టుకున్న వర్గంగా నిర్వచించినప్పటికీ, కుల నిర్మూలన అనేది, ఉనికిలో ఉన్న ఉత్పత్తి సంబంధాల మార్పుతో ముడిపడిన అంశంగా లేదు. ఈ విభేదం డాక్టర్ అంబేద్కర్‌కు, మార్క్సిస్టులకు నడుమ పెద్ద అంతరాన్ని సృష్టించింది. డాక్టర్ అంబేద్కర్– భారతదేశంలో మార్క్సిస్టులు, రెండువైపులా పీడిత కులాల ప్రజలను గెలుచు కోవటానికి ప్రయత్నించే వారుగా మారిపోయారు. ఎందుచేతనంటే, ఇరువురూ కుల నిర్మూలన కోసం కృషి చేస్తున్నారు కనుక. వారి విధానాలు విభేదించాయి. అంబేద్కర్ తన లక్ష్యాన్ని ప్రజాస్వామ్యయుతంగా, రాజ్యాంగ పద్ధతుల ద్వారా నెరవేర్చు కోగలమని భావిస్తే... మార్క్సిస్టులు, కుల నిర్మూలన, వర్గ నిర్మూలన వలె, సమాజంలో విప్లవాత్మకమైన మార్పు ద్వారా సాధించగలమని భావించారు. ఇక్కడ సిద్ధాంత అవగాహనలకు మాత్రమే మనల్ని మనం పరిమితం చేసుకుంటున్నాం. ఈ సమస్యపై రెండు వైపులా ఆచరణలో సాగుతున్న కార్యక్రమాలను ఇక్కడ అంచనా కట్టడం లేదు.

ఏమైనా, వర్గ పోరాటాన్ని డాక్టర్ అంబేద్కర్ వ్యతిరేకించలేదు. కాగా ఈనాటి ఆయన అనుయాయులు అనేకమంది వ్యతిరేకంగా ప్రజలను నమ్మించడానికి ప్రయత్నిస్తున్నారు. దేశంలో మొట్టమొదటి కార్మిక యూనియన్ అయిన ‘బాంబే మిల్ హాండ్స్ యూనియన్’ స్థాపకుడు నారాయణ్ లోఖండే, అంబేద్కర్ అనుయాయుడే.

అంబేద్కర్ తాను కూడా ప్రత్యక్షంగా ట్రేడ్ యూనియన్ ఉద్యమంతో సంబంధాలు కలిగి ఉన్నాడు. ఖోట్స్‌కు (గ్రామాలలో ఆధిపత్యం వహించే పెత్తందార్లు) వ్యతిరేకంగా సాగిన రైతాంగ ఉద్యమానికి ఆయన నాయకుడు. పీడిత కులాలను మొత్తంగా కార్మిక ఉద్యమంతో అనుసంధానించటానికి ఆయన ‘ఇండిపెండెంట్ లేబర్ పార్టీ’ని కూడా స్థాపించాడు. చట్టపరమైన విధానాలను ఉపయోగించి, రాజ్యాంగ పద్ధతుల ద్వారా, ఆయన జీవితకాలమంతా పీడితకులాల (ఆయన పదజాలం ప్రకారం’ దళిత వర్గాల’) సమస్యల పరిష్కారం కోసం, దానిని ముందుకు సాగించడం కోసం ప్రయత్నించాడు. కనుక, రాజ్యసభకు ఆయన ఎన్నికైనప్పుడు నెహ్రూ నాయకత్వంలోని అధునాతన పాలకవర్గాలు ఆయనను పాలకవర్గంలో సమ్మిళితం చేసుకునేందుకు ప్రయత్నించడంలో భాగంగా, తొలుత న్యాయశాఖ మంత్రిని చేశాయి; తదనంతరం, భారత రాజ్యాంగ ముసాయిదా కమిటీ చైర్మన్‌గా చేశాయి. రాజ్యాంగ సభలో ముసాయిదా రాజ్యాంగంపై చర్చ జరుగుతుండగా, తరచుగా కంటే ఎక్కువగానే, ‘రాజ్యాంగం, రాజకీయ సమానత్వాన్ని గ్యారెంటీ ఇస్తోంది... (ఆయన ప్రకారం, ఒక మనిషి– ఒక ఓటు) కానీ ఆర్థిక, సాంఘిక సమానత్వం కాదు’ అని ఆయన తన అభిప్రాయాలను వ్యక్తీకరించాడు. ఈ వైరుధ్యం పరిష్కరించ బడకపోతే సోవియట్ తరహా విప్లవం సంభవిస్తుందని కూడా ఆయన హెచ్చరించాడు. వీటన్నిటితో పాటు, ఫాసిజాన్ని వ్యతిరేకించటంలో సోవియట్ యూనియన్ నిర్వహించిన పాత్ర, డాక్టర్ అంబేద్కర్ అనుయాయులలో సోవియట్ మార్క్సిస్టుల పట్ల సదభిప్రాయాన్ని కలిగించింది. ఆయన దీనిపట్ల స్పృహతో ఉన్నాడు. పైగా, ఆయన కాంగ్రెస్‌లో సమ్మిళితం కాలేకపోయాడు. కనుక, రాజ్యాంగం ఆమోదం పొందిన తర్వాత ఆయన ప్రక్కకు నెట్టివేయబడ్డాడు. 1952 సార్వత్రిక ఎన్నికలలో ఆయన జీవితంలో అత్యంత ఘోరమైన చేదు అనుభవాన్ని చవిచూశాడు. షెడ్యూల్డ్ క్యాస్ట్స్ అసోసియేషన్ అభ్యర్థిగా ఆయన బాంబే నార్త్ నియోజకవర్గం నుండి పోటీ చేయవలసి వచ్చింది. ఆయనకు పోటీ అభ్యర్థులుగా కాంగ్రెస్, సిపిఐ, మరియు హిందూ మహాసభ నుండి ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అయిన నారాయణ్ సదోబా కజ్రోల్కర్, గతంలో డాక్టర్ అంబేద్కర్‌కు సహాయకుడిగా ఉన్నాడు; వెనుకబడిన కులానికి చెందినవాడు. ఈ ఎన్నికలలో అతనే గెలిచాడు. ఈ పోటీలో అంబేద్కర్ నాలుగవ స్థానంలో నిలిచాడు. భారతీయులందరినీ ఈ ఫలితం ఆశ్చర్యానికి గురిచేసింది. భండార నుండి అదే సంవత్సరం జరిగిన ఉపఎన్నికలలో పోటీ చేసిన అంబేద్కర్ తిరిగి ఓడిపోయాడు. ఈ పరిణామాలు ఆయనపై ఘోరమైన ప్రభావాన్ని చూపాయి. రాజ్యాంగ పద్ధతులను వినియోగించుకోవడానికి, ఒక పరిమితమైన లేదా దాదాపు అవకాశమే లేని పరిస్థితిని ఆయన చూశాడు. ఒక రాజ్యాంగబద్ధ ప్రజాస్వామిక వాదిగా, కమ్యూనిస్టులతో ఆయనకు గాఢమైన

పట్టింపు (రిజర్వేషన్) ఉంది. మరికొన్ని ఇతర మార్గాల కోసం ఆయన వెతుకులాటను ప్రారంభించాడు.

చివరకు ... పుట్టుక నుండి కుల విభజనకు తావులేని బుద్ధిజంలోకి మారేందుకు ఎంచుకున్నాడు. అయితే దళిత వర్గాల నాయకునిగా ఆయన ఓ సమస్యను ఎదుర్కొన్నాడు. కులతత్వానికి వ్యతిరేకంగా కమ్యూనిస్టులు కూడా ప్రచారం చేస్తుండటం వలన, పైగా ఫాసిజాన్ని ఓడించడంలో సోవియట్ యూనియన్ పాత్ర, విజయవంతమైన చైనా విప్లవం... వంటివన్నీ ఆయన అనుయాయులపై సానుకూల ప్రభావాన్ని పడవేసి ఉండడంతో, మార్క్సు అభిప్రాయాల వైపు వారి విశ్వాసం మరలకుండా అడ్డగించేందుకు, ఆయన తన స్థానాన్ని గురించి తన అనుయాయులకు వివరించాల్సి వచ్చింది. కనుక, హృదయాన్ని కోల్పోయిన ఒక మేధావి యొక్క నిస్పృహతో కూడిన ప్రయత్నం ఇది. సమర్థించుకోజాలని తన చర్యను సమర్థించుకునేందుకు, తన మరణానికి ముందు బుద్ధుడిని మార్క్సుని ఒకరిపై ఒకరిని నిలిపే చర్యకు పూనుకొని, కుల నిర్మూలన కొరకు తన నిర్దిష్ట మార్గాన్వేషణను అంబేద్కర్ ముగించాడు.

ఈ వ్యాసం డాక్టర్ అంబేద్కర్ యొక్క రాజకీయ, సామాజిక అవగాహనలను, ఆయన ప్రాపంచిక దృక్పథాన్ని తెలుపుతుంది. ఏమైనప్పటికీ... సమాజానికి, భారత ప్రజానీకానికి ఆయన అందించిన తోడ్పాటు నిరాకరించ, నిర్లక్ష్యపరచ వీలులేనిది. భారత అట్టడుగు వర్గాల ప్రజల హృదయాల్లో ఆయన సదా నిలిచి ఉంటాడు.

**(2024 మార్చి 'క్లాస్‌స్ట్రగుల్' నుండి అనువాదం)**

* * * * *